“సిన్నపిల్లల నడిగినట్టుంది బాబయ్యా... అది మా కులవృత్తి... పసరూ నేదూ, గిసరూ నేదు... అబ్బాసం... అబ్బాసం... అబ్బాసం కూసువిద్దె... గుండె నిబ్బరం... దయిరయం... కత్తుల మీద నడవటం బెమ్మవిద్దె గాదండి. బతుకుతెరువు... నిజం సెప్పాలంటే బాబయ్యా... అందరూ నడిసేది కత్తులమీదే... కొన్ని అగుమిస్తాయి... కొన్ని అగుపించవ్... జీవితం అంటే కత్తేనండీ... రెండేపులా పదునున్న కత్తి!”

# క్షురస్య ధారా నిశితా...

రాధామనోహరన్

హనుమంతుగాడు పెద్ద ఇల్లు కట్టుకున్నందుకు ప్రసాదరావుకి విచారంగా లేదు. సుబ్బారాయుడు స్కూటర్ కొనుక్కున్నందుకు ఏడుపుగానూ లేదు. తనకు వంశపారంపర్యంగా దుర్భరమైన కష్టాలొచ్చినందుకు దిగులుగా ఉంది. ఆఫీసులో అందరి ముందు అనవసరంగా ఆఫీసరు తిట్టినందుకు, అకారణంగా చివాట్లు పెట్టినందుకు బాధగా ఉంది. మనస్సుకు తీరని వ్యధగా ఉంది.

జీవచ్ఛవంలా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. పని చెయ్యబుద్ధి కావటం లే దతనికి.

‘పేదవాని కోపం... పెదవికి చేటు...’

‘అలవిగాని చోట... అధికుల మనరాదు...’

‘మిడిమేలపు దొరను గొల్చి...’ మొదలైన సామెత లెన్నో గుర్తు కొచ్చాయి.

పైన ఫాను తిరుగుతోంది... పెద్ద శబ్దం చేస్తూ గాలి తక్కువ... చప్పు డెక్కువ... తన జీవితం లాగే.

అతి కష్టంమీద అయిదయింది... ఫైవ్... ఫైవ్... ఫైవ్...

నీరసంగా ఇంటి దారి పట్టాడు.

సైకిలు ఎక్కబుద్ధి కాలేదు.

దానిని ఎక్కటం కంటే నడిపించుకు వెళ్ళటమే నయం.

ఆ పా...త సైకిలు ప్రసాదరావుకి ఒక ప్రయాణ సాధనమే కాదు... ఎప్పుడూ తోడుండే ప్రాణ స్నేహితుడు కూడా...

కొత్తగా రో డ్డేస్తున్నారు కాబోలు... దారి నిండా కంకరరాళ్ళు. కత్తుల్లా గుచ్చుకుంటున్నాయి.

“ఈ నెల కూడా చెప్పులు కొనుక్కోటం పడలేదు.” గొణుక్కున్నాడు ప్రసాదరావు.

తెగిపోయిన హవాయి చెప్పులకి పిన్నీసు పెట్టి కొన్నాళ్ళు కాలక్షేపం చేశాడు. ఇప్పుడు అవీ లేవు. అబ్బో! ఈ కంకర రాళ్ళమీద నడవటం కష్టమే. ఇంటి కెళ్ళి కమల చేత కొబ్బరి నూనె రాయించుకోవాలి... అన్నట్లు ఇంట్లో కొబ్బరినూనె ఉందో, లేదో...

“కొబ్బరి నూనె రాయమంటారా? నిండుకుందండీ...” కమల నుంచీ నీరసంగా వచ్చే జవాబుని ఊహించుకొనేసరికే ప్రసాదరావుకి పాదాల మంటలు నడినెత్తికి పాకాయి.

** ** **

“హత్తెరీ... ఈ ఊ రొదిలేద్దామొరే... సిన్నాలు” అన్నాడు కాండ్రించి ఉమ్మేస్తూ పెద్దులుగాడు.

కొరడా దెబ్బలతో వాడి ఒళ్ళు బాగా బండబారిపోయినట్లుంది. కమిలిపోయిన వాడి నల్లటి శరీరం మీద స్వేద బిందువులు ఎండ పడి వెండి పూసల్లా మెరుస్తున్నాయి.

“పోదామంటే... పోదాం... నా దేటుంది... ఊరూరు తిర్గి... తిర్గి... అడ్కుతినే దొమ్మరనాకొడుకులం... మన్కేటి... ఈడగినా ఒక ఇల్లా... గిల్లా?” నొక్కి నొక్కి చెప్పాడు సిన్నాలు.

మాట్లాడుతున్నప్పుడు వాడి నోట్లో బీడీ తమాషాగా, స్పీడుగా అటూ ఇటూ కదులుతోంది. గట్టిగా పీల్చిన పొగకి సిన్నాలు కళ్ళు తన్మయత్వంలో నగం మూసుకున్నాయి. ఆ కళ్ళలో బీడీ పొగ పీల్చిన ఆనందం కనిపిస్తూనే ఉంది.

“మ నెదవ బుద్ది గానీ... మన పెద్దోళ్ళు... ఒకే ఒక్కూళ్ళో ఉండి పొమ్మన్నా రేంటి... ఊరూరు తిర్గాల... నాల్గు రాళ్లు సంపాదించుకోవాల... కడుపు కింత తినాల...” అంది రత్తాలు. పిల్లకి పాలిస్తున్న రత్తాలు నల్లటి గ్రానైట్ శిల్పంలా ఉంది.

“ఒసోస్... నువ్ నోర్మొయ్యేస్... ఇటొంటి సయాల్లో ఆడోళ్ళ కేటి తెలుసుద్ది... మేం మేం సూసుకుంటాం గందా...” కోపంగా కసిరాడు సిన్నాలు.

రాత్రి వా ళ్ళిద్దరి మధ్య జరిగిన కీచులాట తాలూకూ కోపం సిన్నాలు మొహంలో చోటు చేసుకుంది.

“ఏట్రా... ఏటి... ఆడకూతురు... దాని మీదల్లా... తనుపాం నాగ లెగుస్తావ్... అ దే టంది? అహ!... అ దేం టందనీ... మనం సెప్పిందే అదీ సెప్పింది... ఊరూరూ తిర్గల్సినోళ్ళం... ఒకే ఊ రట్టుకొని ఎర్రిపీనుగుల్లా... ఏలాడుతున్నాం అంది... ఏరే ఇదంగా గానీ సెప్పిందా...?” కూతుర్ని సమర్ధించాడు పెద్దులు. వాడు ఉద్రేకంగా మాట్లాడుతోంటే మెడమీద రక్తనాళం ఉబ్బుతోంది.

“ఆ మాట కొస్తే నే నా యినయం... ఎప్పుడో సెప్పినా... ఈ ఊరోళ్ళు... ఎదవ తొత్తునాకొడుకులు... అటంత సూసి ఎల్లిపోత రు... అప్పుడు నా మాట లాలకించినారా... మార్సెయ్యి... ఊరు మార్సెయ్యి. కొత్తూరు... కొత్త జెనం... సిల్లర... సిల్లర... వరసం వరసం కురిసినట్లు కురుసుద్ది... కనకేటంటే...” ఇంకా చెవుతున్నాడు సిన్నాలు.

‘నే సెప్పిందే... నువ్వూ సెపుతున్నావ్... ఏదో తెలవని వినయం సెప్పినట్లు విమరిశకంగా సెప్తావేటి?” పెద్దులు మాటల్లో పిసరంత విసుగు, నలుసంత మందలింపు, ఆ ఊ రొదిలెయ్యాలనే సంసిద్ధత ధ్వనించాయి.

** ** **

మసి లాంతరు కట్టిన పాత గూడు ఒంటెద్దుబండి రెండు రోజులు ప్రయాణం చేసింది బరువుగా.

అది కదిలే ఇల్లు...

పేదరికానికి ప్రతిబింబం...

కానీ చేతనత్వాని కది చిహ్నం...

** ** **

దినపత్రిక కోసం కిటికీ తలుపు తెరిచాడు ప్రసాదరావు. ఎదురుగుండా ఉన్న ఖాళీ స్థలంలో ఏదో ఇంద్రజాలం చేసినట్లు తెల్లారేప్పటికి ఒక కుటుంబం వెలిసింది. ప్రసాదరావుకి ఆశ్చర్యం వేసింది.

చుట్ట కాలుస్తున్న ముసలాడు, బీడీ కాలుస్తున్న యువకుడు, నేర్పుగా వెదురు కర్రలు వంచి వాటిమీద చిరిగిన బొంతలు కప్పుతున్న యువతి... రాగి తీగెలాంటి ఓ ఆడపిల్ల... అరుపులు... హడావుడి... గందరగోళం...

ఒక గంటలో వాళ్ళు సామాన్లు సర్దుకున్నారు అన్నీ అమరికగా... ముసలాడు విపరీతంగా దగ్గుతూ ఉమ్మేస్తున్నాడు. ఆయాసంతో వాడి పక్కలు ఎగురుతున్నాయి. ఆస్తమా లాంటి మాయరోగం ఏదో వాడిని పట్టి పీడిస్తోంది.

మూడు రాళ్ళు పెట్టి ఇంత చెత్త పోగుచేసి పొయ్యి మీదికి కుండెక్కించింది రత్తాలు. మోకాళ్ళ మీదకు ఒంగి... కర్ర గొట్టంతో ఊదింది పొయ్యిలోకి. మంట కంటె పొగ ఎక్కువయింది. అమ్మయ్య! మంట అందుకుంది... కుత కుత ఉడుకుతోంది అన్నం.

“అయ్యా! ఓపాలి ఇది సూస్తూండూ...”

పెద్దుల్ని హెచ్చరించి రత్తాలు నీళ్ళవేటకి కుండ తీసుకు బయలుదేరింది.

** ** **

ప్రసాదరావు స్నానాదికాలు పూర్తిచేసి వేంకటేశ్వరస్వామి ఫోటోతో మాట్లాడి అగరొత్తులు వెలిగించాడు. ఫోటోలో 'శ్రీనివాసుడు' ఏం మాట్లాడలేదు.

ఆఫీసు కెళ్లామని సైకిలు బయటపెట్టాడు ప్రసాదరావు. ఇంటి ముందు స్థలంలో అప్పుడే జనం చేరారు. గుండ్రంగా కూర్చున్నారు. ఆ వింత చూస్తూ నిలబడిపోయాడు అప్రయత్నంగా.

కొయ్య రాటలకి గట్టిగా కట్టిన త్రాటిమీద రాగి తీగెలాంటి పిల్ల నడుస్తూంది. పరికిణీ మడిచి వెనక్కి గోచీలా పెట్టుకొంది. పమిట బొడ్లో దోపుకుంది. తల్లో నిన్నటి వాడిన మల్లెపూలు, నెత్తిమీద కుండ, చేతిలో సన్నని కర్ర అడ్డంగా పట్టుకుంది. గరిమనాభి తప్పిపోకుండా అటూ ఇటూ బాలెన్సు చూసుకుంటూ నడుస్తోంది. మెళ్ళో రంగు రంగుల చవుకరకం రెండు పేటల పూసల దండ గుండెలమీద అటూ ఇటూ ఊగుతోంది. జనానికి అది కూడా ఓ ఆకర్షణే.

"అంతెత్తునుంచీ పడిపోతే!" ప్రసాదరావుకి భయం వేసింది.

"టమకుటమా... టమకుటమా..." డోలు వాయిస్తోంది రత్తాలు. వీపుమీద జోలెలో బొద్దు పిల్ల నిద్దరోతోంది. గుడ్డు పగుల గొట్టుకొని బయటికొచ్చిన కోడిపిల్లలా... తడిసిన ఊలు బంతిలా చెమటతో తడిసిపోయిం దా పాప.

"జనక... జనక... జజ్జనక జనక..." మునలాడి పద విన్యాసంలో ఒక లయ, వాడి కాళ్ళ గజ్జెల్లో ఒక వింత ధ్వని...ఓ తూగు... ఓ తమాషా... ఒక వింత ఆకర్షణ.

"బావా... బావా... బంతిపూవా... పండెక్కి నా బండెక్కవా..." ఉషారుగా పాడేస్తున్నాడు సిన్నాలు.


ఎందుకో చటుక్కున ప్రసాదరావుకి ఆఫీసు గుర్తొచ్చింది. వెన్నులోంచి చలొచ్చింది. ఆట చూస్తున్న ప్రసాదరావు మనస్సు దారి తప్పింది.

"ఇంకా పని చెయ్యి... ఇంకా పని చెయ్యి..." పీక్కు తింటాడు ఆఫీసరు వెధవ. కుళ్ళు ముండా అత్తగారి సాధింపు... వాడూనూ.

తన రక్తం పిండుకొని పాయసంలా

# సైంటిస్టుల ఊహా జోస్యం

**21 వ శతాబ్దపు విజ్ఞాన పట్నం చూడర బాబూ! వింతలు విచిత్రాలు ఎన్నో ఉన్నాయ్ రీడర్ బాబూ**





అబ్బే, సైంటిస్టులు జోస్యం ఎందుకు చెబుతారూ! చెప్పరు. నిజమే!

కాని ప్రస్తుతం సైన్సు మహాసముద్రంలో పడి లేస్తున్న అనేకానేక కెరటాల ధోరణి ఆధారంగా వాళ్ళు వివిధ రంగాలలో ఈ విధమైన ఆవిష్కరణలు, పోకడలు రావచ్చును అని ఊహిస్తారు.

అమెరికాలోని రాండ్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో 82 మంది వేర్వేరు సైన్సు శాఖల ఘనాపాఠీలు కలసి ప్రశ్నలు వేసినప్పుడు సైన్సు నాడి ఇలా పలికిందిట.

*2000 సంవత్సరం నాటికి ...*

- జన్యు కణాలను చిత్తం వచ్చినట్లు ఆడించవచ్చునట! **[అప్పు డిక అంతా అబ్బాయిలే పుడతారో!]**
- సముద్రాలను పొలాలుగా, గనులుగా మార్చుకుంటాముట! **[భూపరిమితి చట్టం గోవిందా!]**
- ఇంట్లో అన్ని పనులు [ఆ! అన్నన్ని పనులూ] చేసే రాబట్లు కిటకిటలాడుతుంటాయట! **[కోడళ్ళు వర్ధిల్లాలి!]**

*2004 నాటికి ...*

- రహదారుల మీద పోలీసులూ వాళ్ళూ లేకుండా అన్నీ ఆటోమేటిక్‌గా రాకపోకలు నియంత్రితం అవుతాయి. **[అమ్మాయ్యా బంద్!]**

*2010 - 20ల మధ్య ...*

- తెలివి తేటలను పెంచే మందులు వస్తాయి. **[[''ఏమోయ్! ఒక రెండు 'గణితశాస్త్రం' కాప్స్యూల్స్ ఇవ్వు!'' అని అంగట్లో కొనుక్కుని పరీక్షకు వెళ్ళి రాసి వచ్చే యత్నమన్నమాట! అన్నట్లు అప్పుడు 'మండలి' ఏమవుతాదో!]**
- వయసు పెరిగినా, దాని ప్రభావం శరీరం మీద పడనివ్వని రాసాయనిక గుళికలు వస్తాయట! **[శ్రీదేవి, వాళ్ళూ తమ వయస్సు గురించి మరోటీ మరోటీ చెప్పక్కర్లేదు! - ఇంతకూ ఆ ''తిరిగి యవ్వనం పొందండి'' బాపతు వైద్యులు ఏ మవుతా రేమవుతారోచ్!]**
- మనుషులు, మెషిన్లు ఇంచక్కా కలసి పనులు చేసుకుంటారు. **[[ఇదుగో కంప్యూటర్ భాయి! నే నిప్పుడు నీతోపాటు పార్టీకి రాలేను. న న్నపార్థం చేసుకోకు. కావాలంటే సుశీల నడుగు'' అంటాడు మోహన్.]**

తాగుతున్నాడు. ఏ నెగ్గొట్టి ఎదురు సమాధానాలు చెప్పే వాళ్ళ జోలికి పోడు. పిరికి ముండాకొడుకు. మెత్తగా ఉన్న వాళ్ళ మీదే అధికారం చెలాయిస్తాడు. అహంకారం కురిపిస్తాడు.

టైపిస్టు నరసింహం అంటూ ఉంటాడు. ఇల్లాల్ని మెప్పించగలం గాని, వెలయాలిని మెప్పించగలమా అని... నిజమే... ఈ ఆఫీసరుగాడి[ద]కి దయ లేదు. కరుణ లేదు. జాలి లేదు.

"అర్జెంట్... అర్జెంట్... అన్నీ అర్జెంటే... అవుట్ టుడే... ఫినిషిట్ టుమారో... సెండ్ ఇట్ ఇమ్మీడియట్‌లీ..."

కొంపలు మునిగిపోయినట్లు తొందర... కంగారు.

"ఇదిగో పెసాదరావు... ని న్నేం చేశావు? ఇవ్వాళేం చేస్తావ్... రేపేం చెయ్యబోతున్నావ్?"

"నీ బొంద చేస్తాను... దొం..." లోపలి ప్రసాదరావు మనసుకు కవాటం పడిపోయింది... మళ్ళీ ప్రసాదరావుకి నిన్నటి సంఘటన గుర్తొచ్చింది.

"నిన్న లెడ్జర్ పోస్టింగ్స్ అయిపోయాయి సర్! ఈ రోజు ఆ కరస్పాండెన్స్ అటెండయి రేపు ఆడిటర్స్ అడిగిన వర్క్ కంప్లీట్ చేస్తాను." వినయంగానే చెప్పాడు తను... కానీ... ఆ వె...విం‌టేనా? వాడి మాటే వాడిదే.

"ఆ వనంత అయిపోయేదాకా సెలవు పెట్టకు." భూతద్దాల వెనక ఆఫీసరు కళ్ళు పాదరసం బుడ్లలా మెరుస్తున్నాయి. గుడ్లగూబ కళ్ళలా క్రూరంగా ఉన్నాయి.

"సెలవు పెట్టకుండా ఇక్కడే ఛస్తానులే!" లోపలి ప్రసాదరావు నోరు నొక్కి "సరే సార్!" అన్నాడు పైకి.

ఆ పిల్ల 'తాటి చివరికి వచ్చేటప్పటికి ప్రసాదరావు వర్తమానంలోకి వచ్చేశాడు. మునలాడు నోట్లోంచి చుట్ట తీసి అవతల పారేశాడు. తలపాగా తీసి నడుముకి కట్టుకున్నాడు. బుట్టలోంచి కొండచిలువ లాంటి కొరడా తీసి ఒంటిమీద ఛెళ్ళు ఛెళ్ళు మని కొట్టుకున్నాడు. వాడి మొహంలో ఏమాత్రం బాధ లేదు.

"అట్లా ఆఫీసర్‌గాడిని కొడితే..." ప్రసాదరావు తీరని కోరికల్లో అ దొకటి. తన కుటుంబాన్ని ఎవరైనా పోషిస్తే... ఆ బట్టతల దయ్యంగాడిని చంపేసి సెంట్రల్ జైల్‌కి వెళ్ళిపోవచ్చు. కానీ ధైర్యం లేదు.

మునలాడి ధైర్యానికి జనం ఆశ్చర్యంతో చప్పట్లు కొట్టారు.

'దిస్ దేస్‌మె గంగా బయితీ అయి... దిస్ దేశ్‌మె గంగా బయితీ అయి..." సిన్నాలివ్పుడు పాట మార్చాడు.

చెవిలో బీడీ తీసి వెలిగించుకున్నాడు.

పాట ఆగిపోయింది.

డోలూ ఆగిపోయింది.

ఏదో ప్రమాదం జరగబోతున్నట్లు నిశ్శబ్దం ఆవరించుకుంది జనం మధ్య.

మునలాడు ఒక పొడుగాటి చెక్క తీశాడు. దానిమీదున్న గుంటల్లో కత్తులు నేర్పుగా గుచ్చాడు. పిడి లోపలికి, పదునైన మొనలు పైకి. ఎండకి ఆ కత్తులు తళతళా... తళతళా మెరుస్తున్నాయి. భయంకరమైన కాలసర్పపు నాలుకల్లా... డ్రాగన్ నోటిలోంచి వచ్చే మంటల్లా ఉన్నా యా కత్తులు.

జనానికి ఉత్కంఠ పెరిగింది.


ఊపిరి బిగపట్టారు అందరూ.

ప్రసాదరావుకి నిజంగా భయం వేసింది. "ఏం చేస్తాడు... కొంపతీసి వాటిమీద నడుస్తాడా ఏమిటి... కాళ్ళలో కత్తులు దిగబడి... రక్తం కారి సెప్టికై... అక్కడి కక్కడే వాతం కమ్మి ఛస్తాడు. అది వాడు నడవాల్సింది కాదు. దానిమీద ఆఫీసర్‌ని పడుకోబెట్టి వాడిమీద ఇంకో చెక్క వేసి నొక్కితే... ఫినిష్... ది ఎండ్...

"బాటనీ పాటం ఉంది... మాటినీ ఆట ఉంది. దేనికో నీ ఓటు సెప్పరా... ఇట్టరీ లెచ్చరుంది... మిట్టరీ పిచ్చరుంది..." ఈసారి మళ్ళీ పాట మారింది.

మునలాడు అనుకున్నంత పనీ చేశాడు. ఆ కత్తుల మీద మెల్లగా నడిచాడు. కాళ్ళ కేదో పసేతు రాసుకొని ఉంటాడు. ఒక కత్తిమీద నుంచీ ఇంకో కత్తిమీదకి... ఇంకో కత్తి... అమ్మయ్యో! జనం ఊపిరి పీల్చుకున్నారు. ప్రసాదరావు నిట్టూర్చాడు. గుండె దడ వేగం తగ్గింది.

పది పైసలు, పావలాలు, అర్ధ రూపాయలు... చిల్లర వర్షం... వర్షం కురిసినట్లు పడింది.



## 2020 - 2030ల మధ్య

- అంతర్జాతీయంగా అందరికీ ఒక స్థాయి ఆదాయం గారంటీగా దొరుకుతుంది! [వర్ణములు, వర్ణ వైషమ్యములు, అంతర్జాతీయ ద్రవ్యనిధి ముందు చేయిజాచే 'భారతపుత్రావులు'__ అంతరించిన స్వర్ణయుగం వస్తుందా! 'నిజంగానే నిజంగానే మానవాళికి మంచికాలం రహిస్తుందా!']
- భూమ్యాకర్షణ శక్తి నిరోధకాలు సిద్ధం అవుతయి!
  [ప్రవరుడి పాదం మీది అంజనం కరిగి అతడు వరూధిని పాలబడే సీనుకు ఆస్కారం లేదు. మహేష్ యోగి గారి 'లెవిటేషన్' సిద్ధి అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇంటి బూజు దులుపుట, మామిడి చెట్టు మీది పండ్లు కోయుట, సీలింగ్ ఫాన్ మీద కూర్చున్న పెంపుడు పావురాయిని అందుకొనుట చాలా చాలా సులు వవుతాయి.]
- అవతలవారి మనసులోని ఆలోచనలను ఇట్టే చదివేసేయగల శక్తి సాధిస్తాము. ["ఎడిటర్ గారూ! నే నీ నవల 'సినాప్సిస్' చెబుతుంటే ఇతగాడు దీనిని ఏ ఇంగిలీసు ఒరిజినల్ నుంచి కొట్టేశాడో అని మీరు నా కలం ప్రాతివత్యాన్ని శంకిస్తున్నారు. కాని నిఝంగా ఇది ఏ ఇంగ్లీసు నవలకూ పుట్టిన బిడ్డ కాస్సార్!" అని నావెలిస్టు ఆక్రోశించే సినేరియా సాధ్యం!]
- గ్రహాంతరవాసులతో మాటా మంతీ సాధ్యం అవుతుందిట!
  ["ఒరేయ్ సన్యాసిరావూ! ఆ వం దెకరాల మాగాణి డాక్యుమెంటు మీద నువ్వు చేసిన నా సంతకం తుడిపేస్తావా, లేపోతే జడ్జిగారికి ఫోన్ చేయమంటావా?"
  "ఏమండోయ్! ఇంకా నే నిట్లా పైకి వచ్చి రెండు వారాలు కాలేదూ ... ఆ నిర్మలతో ఏవిఁటి అంతలా పరాచికాలు."]
- మెదడు మెదడుతో 'సంభాషిస్తుం'దట!
  [పాపం నోరూ, నాలుకా అవాక్కయిపోయాయి కాబోలు! 'న వాక్ గచ్ఛతి' అన్న ఉపనిషద్ వాక్యార్థాన్ని కొత్త రూపంలో చూస్తాము కాబోలు!]
- అణుధార్మిక శక్తి నిరోధక టీకాలు లాటిది లభ్యం అవుతుంది!!
  ['ఛెర్నోబిల్', 'త్రీ మైల్ ఐలండ్' లాటి ప్రమాదా లుండవు. అణు విద్యుత్కేంద్రాలకు, పర్యావరణ పరిరక్షకులకు మధ్య అభిప్రాయ భేదా లుండవు.]

అయ్యో లేక అమ్మో! ప్రస్తుతానికి ఈ నాడీ వాణి ఇక్కడితో సమాప్తం!

[బ్రాకెట్ల మధ్య ఉన్నది సైంటిస్టుల జోస్యం కాదు. 'ఆంధ్రప్రభ' సరదాగా చేసిన ఊహాగానాలు సుమండీ!]

ఆడమనిషి చిల్లరంతా ఏరుకుంది. జనం నెమ్మదిగా వలచబడసాగారు.

ప్రసాదరావు సైకి లెక్కాడు... తొక్కుతున్నాడు. చక్రాలు తిరుగుతున్నాయి... కానీ దూరం తగ్గటం లేదు.

మనస్సు వెనక్కి మళ్ళింది. చిన్నతనం నుంచీ తనది నికృష్టపు బ్రతుకే. చీమలా కష్టపడ్డాడు. తమ్ముళ్ళని చదివించాడు. చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చేశాడు. ఏరీ వాళ్ళంతా... రెక్క లొచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు.

తండ్రి మిగిల్చింది... చెదలు తినేసిన పాత పెంకుటిల్లు... దాని తాలూకు తాకట్టు పత్రాలు.

పిల్లాడికి చదువు లేదు... వాడు చిరంజీవి అభిమాన సంఘంలో యాక్టివ్ మెంబరు. అమ్మాయికి త నిప్పుడేప్పుడే పెళ్ళి చేసే స్థితిలో లేడు... దానికి నవలల పిచ్చి...

రోజుకి పది గంటలు పని.

వారం... వారం... నెలంతా... పన్నెండు నెలలు... సంవత్సరాల తరబడి...

త నెప్పుడైనా సంతోషంగా నవ్వాడా? ఎక్కడ నుంచి ఎక్కడికి వెళుతున్నాడు తను? ఇంటినుంచి ఆఫీసుకి... శాంతి లేదు... మనశ్శాంతి లేదు... విశ్రాంతి లేదు... అది తనకి ఒకేసారి వస్తుంది... చచ్చిపోతే... అంతే... ఆత్మ... పరమాత్మలో విలీనం అయిపోతే...!

** ** **

రోహిణి కార్తె ఎండలకి రోళ్ళు బద్ద లవుతున్నాయి.

ఆఫీసులో అడుగు పెట్టేసరికి పెంటకుప్పలా ఫైళ్ళు.

"అయ్యగారు పిలుస్తున్నారు!" ప్యూనుగాడికి కూడా ఒళ్ళు బలుపే. వాడు వాపు చూసి బలుపు అనుకునే రకం.

సంతకం పెట్టి ఆఫీసర్ గదిలో అడుగు పెట్టాడు ప్రసాదరావు.

సా మ్మొకడిది... సో కొకడిది.

శ్రమ ఒకడిది... ఫలితం మరొకడిది.

కష్టం గుమాస్తాలది... లంచం ఆఫీసర్లది.

తొక్కలు వీళ్ళవి... పప్పులు వాళ్ళవి.

చేపల చెరువు లాంటి చల్లటి ఆఫీసరు గది ప్రసాదరావుకి వేడిగా, అనీజీగా అనిపించింది. వట్టి వేళ్ళ తడికల కమ్మటి వాసన దుర్భరంగా ఉంది అతనికి.

కుర్చీలో పెద్ద కోరల తిమింగలంలా కూర్చొని న్యూస్ పేపరు తిరగేస్తున్నాడు ఆఫీసరు. వాడిని చూస్తేనే ఎలర్జీ... అల్పబుద్ధి వానికి అధికార మిచ్చిన దొడ్డవారి నెల్ల తొలగదోయు...

"నమస్తే సార్!" ప్రసాదరావు గట్టిగా అన్నా ననుకున్నాడు. కానీ అది ఆఫీసర్‌కి వినిపించలేదు. లేక ఆఫీసరు వినిపించుకోలేదు... లేక వినిపించుకోవటం తిమింగలాని కిష్టం లేదేమో...

"ఇట్లా వర్కంతా పెండింగ్ పెట్టేస్తే నీకు శ్రీకాకుం ట్రాన్స్‌ఫర్ తప్పదు..." సింహం గర్జించిందా? పులి గాండ్రించిందా? తోడేలు అరిచిందా? మదపుటేనుగు ఘీంకరించిందా?

తనకి వంద ఫైళ్ళు...

నరసింహానికి పది ఫైళ్ళు...

తను వర్కు కంప్లీట్ ఎలా చెయ్యగలడు?

ఎలా...? ఎలా...? ఎలా?

తన బలహీనత ఆఫీసర్‌కి తెలుసు.

తనకు అండ లేదు.

ఆఫీసర్ బలహీనతలన్నీ నరసింహానికి తెలుసు. వాడు ఆఫీసులో పని చెయ్యడు.

ఆరు గంటల తరువాత సీసాల మూతలు తియ్యటం, సోడాలు కొట్టటం... పది తరువాత పక్క లెయ్యటం... నోట్ల కట్టలు అమ్మగారికి చేరవెయ్యటం... నరసింహం మంత్రి... ఆఫీసర్ కిరీటం లేని రాజు... ఆఫీసు వాళ్ళ స్వంత ఎస్టేటు మరి. నరసింహానికి ప్రసాదరావుని చూస్తే జాలి... బ్రతకటం చేతకాని వాడని... అమాయకుడనీ... ప్రతి చిన్న విషయానికి భయపడతాడని... ఎట్సెట్రా... ఎట్సెట్రా...

** ** **

మధ్యాహ్నం కాఫీ కూడా తాగని ప్రసాదరావు నీరసంగా ఇంటికి తిరిగి వస్తుంటే... ఎదురుగుండా వీరయ్య...

అమ్మో... అప్పు... వడ్డీ... ప్రోనోటు...

పక్క సందులోకి దూరితే... చూసేశాడు.

అమ్మయ్య! గండం గడిచింది.

తల ప్రాణం తో క్కొచ్చింది.

## నేనైతే

**భార్య:** ఇదిగో, పేపరు చూశారా? ఒకడు సైకిలు కోసం పెళ్ళాన్ని అమ్ముకున్నాడట!

భర్త: వాడు వట్టి మూర్ఖుడిలా ఉన్నాడు. నేనైతే మోటారు సైకిలుకు తగ్గేవాణ్ణి కాదు.

**ఆర్. మురళి [హిందూపురం]**

...వదిలాడు... జలగ... జలగ...

వడ్డీపై వడ్డీ...

తన పెంకుటి ల్లయిపోతుంది... ఖతం అయిపోతుంది... ఫినిష్...

తను రోడ్డుమీద నడుస్తున్నాడా? లేక కత్తుల వంతెనమీదా...? అవతలి గట్టుకి చేరే దెప్పుడు... ఎప్పు డెప్పుడు...? ఎన్నా ళ్ళీ ప్రయాసతో కూడిన ప్రయాణం... పూర్తిగా అలసిపోయాడు... విపరీతమైన దాహం... దాహం... దాహం...

ప్రసాదరావు ఇంటి కొచ్చేసరికి ముసలాడు దాహం తీర్చుకుంటున్నాడు. తీరిగ్గా చాపమీద కూర్చొని సీసా నిండా మందు... ముందు పకోడీల పొట్లం.

ఒక్కొక్క గుక్కకి వాడి మొహంలో బ్రహ్మానందం. వాడు ఈ లోకానికీ... స్వర్గానికీ మధ్య నున్న సన్నని ఎత్రటి అంచుమీద నృత్యం చేస్తున్నాడు... ది డాన్స్ ఆఫ్ శివా....

వాడి కెంత ధిమా... ఎంత హాయి...

వాడు ఎవరికీ తల అమ్ముకోలేదు...

వాడి కొంపకి తాకట్టు పత్రా ల్లేవు..

వాడి పిల్లలు అంతో ఇంతో సంపాదిస్తున్నారు కూడా.

ప్రసాదరావుకి వాడితో మాట్లాడ లనిపించింది.

"ఏం ముసలయ్యా! గిట్టుబాటుగా ఉందా ఈ ఊరు. నీ పేరేమిటి?" ప్రశ్నల్లో కూడా తొందరపాటు...

"నా పేరు పెద్దులండి." సారా వాసన గుప్పుమంది.

"మీ దే ఊరు?"

ప్రసాదరావు ప్రశ్నకి ముసలాడు గట్టిగా నవ్వాడు.

"మనూ రేటండీ... అన్నూళ్ళూ మాయే... ఈ దేశవంతా మాదే... అడుక్కుతినే నాయాళ్ళకి అరవై ఆరూళ్ళని... మాది కోనసీవ బాబు: మా తల్లి గోదారితల్లి... చల్లని మా తల్లికీ... మాకూ రుణం తీరిపోనాది... ఇంకేటంటే... సొంతూరు లేదు..." వాడి ధైర్యానికి ప్రసాదరావుకి ఈర్ష్య కలిగింది... జెలసీ... జెలసీ...

"వీళ్ళంతా ఎవరు?" ప్రసాదరావు వేసిన మరో కుంటి ప్రశ్న.

"పొద్దుట తాడుమీద నడిసిందే... అది నా సిన్న కూతురండి. పేరు బుల్లి. మహా తెంపరిది. తిరుగుబోతు ముం... రౌడీ ఎదవ నొకణ్ణి మరిగింది... ఆడు జేబులు కొ..." ముసలాడు నాలి క్కొరుక్కున్నాడు... నవ్వుతూ కన్ను గీటాడు. "ఆడు జైలు కెళ్ళాడు... ఇది మళ్ళీ నాకాడికి సేరింది... అది రత్తాలు. నా పెద్ద కూతురండి... నిలక డైనది. ఆ డల్లుడు... అద్దదిగో... ఆ నలుసు ఆళ్ళ పిల్ల."

మాట్లాడుతుంటే వాడికి ఎక్కిళ్ళు వస్తున్నాయి. ఒక ఉప్పు రాయి నోట్లో వేసుకున్నాడు.

"మా యాడది... రాజమండ్రంలో ఆట లేస్తుంటే బేదు లొచ్చి నచ్చిపోనాది. నిండుకుండ... మం చిగ్రవం... ఏం నాబం... మట్టైపోనాది. అప్పటినుంచీ నేను రోజూ మందేసుకుంటుండా... అది గురుతు కొస్తంది..." వాడి కోణంలోంచి చూస్తే జీవితం ఎంతో తేలిగ్గా... ఏజ్ ఎ మాటర్ ఆఫ్ ఫాక్ట్‌లా కనిపించటంతో ప్రసాదరావుకి సిగ్గేసింది... "మనిషంటే వాడు... ఎస్... హి ఈజ్ ది మాన్..." ప్రసాదరావు ముసలాడి కేసి ఆరాధనగా చూస్తూండిపోయాడు.

** ** **

ఆ రాత్రి ప్రసాదరావుకి నిద్ర పట్టలేదు.

వాడికీ, తనకీ ఎంత తేడా?

వాడు ఏనుగు... తను దోమ.

తనకి ఉనికే లేదు. వా డో రాజాలాగా బ్రతుకుతున్నాడు.

వాడికి జీవితం అంటే వర్తమానం మాత్రమే.

తనకి ఎప్పుడూ గతం... భవిష్యత్తు.

వాడికి చింత లేదు... దిగులు లేదు.

తనకి అన్నీ సమస్యలే... అన్నీ దిగుళ్ళే...

అలసిపోయిన కమల ఆదమరచి నిద్రపోతోంది. కమల శారీరకంగా అలసిపోయింది. అందుకే హాయిగా నిద్రపోగలుగుతోంది. తను మానసికంగా అలసిపోయాడు. అందుకే తనకి నిద్రమాత్రలు కావాలి.

అబ్బాయి ఇంటికి రాలేదు.

సినిమాకి చెక్కేసుంటాడు. పాత కాగిత లమ్మేసిన డబ్బుతో.

అమ్మాయి ఏదో ఒక చౌకబారు బెజవాడ నవల "నిన్ను ప్రేమిస్తా... నన్ను క్షమించు" చదువుతోంది. అది ఏదో వారపత్రికలో ధారావాహికంగా వచ్చిందిట. జనాన్ని ఊపేసిందిట... పిచ్చెక్కించిందిట... ట... ట... ట...

ప్రసాదరావుకి మాగన్నుగా నిద్ర పట్టింది.

ఆ కలత నిద్రలో ఒక కల.

కల కాదు... అనుభూతి.

కాదు... కాదు... ఆలోచన... భయం..

రెండు ఎత్తైన కొండ కొమ్మల్ని కలుపుతూ ఓ పెద్ద వంతెన... కత్తుల వంతెన... కింద లోతైన అఘాతం... చీకటిలో అస్థిపంజరాల వికృత విన్యాసం... కళేబరాల కుళ్ళు కంపు... కోట్ల కోట్ల పాము పిల్లల లుకలుకలు... అవతల వేపు దూరంగా... చాలా దూరంగా... ఒక చిన్న వెలుగు... అక్కడి కెళ్ళాలి తను... ధైర్యం కూడగట్టుకొని... పళ్ళు బిగపట్టి కత్తుల వంతెన మీద చాలా జాగ్రత్తగా నడుస్తున్నాడు. తన గుండె చప్పుడు తనకే వినిపిస్తూంది.

దాహం... భయం... వణుకు... కంగారు... దడ... గాభరా... వళ్ళంత చెమట...

నిశ్శబ్దం... భయంకరమైన నిశ్శబ్దం...

శరీరం వశం తప్పుతోంది...

అమ్మో! వెనకనుంచి ఎవరో తోస్తున్నారు...

ఆ పీనుగ కాదు గదా... కాకపోవట మేమిటి? వాడే... అయిపోయింది... అంత అయిపోయింది.

తను లోయలో పడిపోయాడు...

క్షురస్య ధారా నిశిత... కత్తులమీద నడవలేకపోయాడు... ఓడిపోయాడు తను...

"అమ్మా!" కేకేశాడు ప్రసాదరావు.

ఉలిక్కిపడింది కమల.

"ఏం లేదు... పీడకల... కాసిని మంచినీళ్ళియ్యి..." గట గట మని చెంబుడు నీళ్ళు తాగాడు. దాహం తీరలేదు. కడుపులో మంట... తీరని ఆరని జ్వలిత జ్వాల... దహించుకుపోతోంది... పిచ్చి ఆలోచనలు... తెగిపోతున్న చిత్రాలు... పీడకలల సముదాయం...

సినిమా పిచ్చితో అబ్బాయి హొటల్లో సర్వర్ అయ్యాడు. "రెండిడ్లీ... మూడు కాఫీ..."

నవలల్లో పాత్రలు నిజ మనుకునే అమ్మాయి గిరజాల జుట్టు కుర్రాడితో పకపకలు...

అప్పు అండ్ వడ్డీ ప్లస్ వడ్డీ ఈజ్ ఈక్వల్ టు వేలంపాట ఆఫ్ పెంకుటిల్లు.


గుండె జబ్బుతో బూజుల కర్రకు చీర కట్టి, జాకెట్టు వేసినట్లు కమల, ట్రాన్స్‌ఫర్డ్ టు శ్రీకాకుళం విత్ ఎఫెక్ట్ ఫ్రమ్ ఫస్టాఫ్...

"అమ్మా... తల్లీ... రక్షించు.."

"ఏమిటండీ!" కమల తనని నిద్ర లేపుతోంది.

"ఏం లేదు... కాసిని మంచినీళ్ళు..." మళ్ళీ మంచినీళ్ళు త్రాగాడు ప్రసాదరావు.

** ** **



ఇంకా పూర్తిగా తెల్లారలేదు. వేపపుల్లతో మొహం కడుక్కుంటున్నాడు ముసిలాడు.

ప్రసాదరావు వాడి దగ్గరకు ఆత్రుతగా నడిచాడు.

"నిన్న కత్తులమీద నడిచావు... కాళ్ళ కేమైనా రాసుకుంటావా?"

అమాయకమైన ఆ ప్రశ్నకి మూసలాడికి నవ్వు వచ్చింది.

వాడి నవ్వు... దగ్గు... మాటలు... అన్నీ కలిసిపోయాయి... త్రీ ఇన్ వన్.

"సిన్నపిల్లల నడిగినట్టుంది బాబయ్యా... అది మా కులవృత్తి... పసరూ సేదూ... గిసరూ సేదు... అబ్బాసం... అబ్బాసం... అబ్బాసం కూసు విద్దె. గుండె నిబ్బరం... దయిరయం... కత్తులమీద నడవటం బెమ్మ విద్దె గాదంటీ... బతుకుతెరువు... నిజం సెప్పాలంటే బాబయ్యా... అందరూ నడిసేది కత్తుల మీదే... కొన్ని అగుపిస్తాయి... కొన్ని అగుపించవ్... జీవితం అంటే కత్తేనండీ... రెండేపులా పదునున్న కత్తి..."

ప్రసాదరావుకి ముసలాడు బోధివృక్షం కింది బుద్ధుడిలా... శిలువమీద జీసస్‌లా... యుద్ధ రంగంలో భగవద్గీత చెప్తున్న కృష్ణుడిలా కనిపించాడు... వాడి చుట్టూ క్షణంలో సగంసేపు వింత వెలుగు.

దూరంగా రేడియోలో - "సూర్య నారాయణా... వేద పారాయణా..." భక్తిరంజని వినిపిస్తోంది.

లేత సూర్యుని... ఎండ వేడిలో ప్రసాదరావుకి ఏదో వింత వెలుగు కనిపించింది. కొత్త ధైర్యం కలిగించింది.

"శ్రీ సూర్యనారాయణా... వేద పారాయణా
లోక రక్షామణీ... దైవ చూడామణీ"

మనసులో మననం చేసుకుంటూ ముం దడుగేశాడు ప్రసాదరావు. ★